సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం ¦ 28 ¦ నవంబర్ ¦ 2023



రూ.1,00,011 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రొంగల రవికృష్ణ, వెంకట పద్మావతి దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం) సోమవారం రూ.1,00,011 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నాళ్ల వేంకట సత్యనారాయణరావు దంపతులు (కృష్ణా జిల్లా తిరువూరు) సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

2,900 క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 2,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 300, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.45 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

వెన్నుపోటు పొడిచింది మీ బాబే

లోకేష్‌పై ఎమ్మెల్యే రాపాక మండిపాటు



రాజోలు/మలికిపురం: టీడీపీ నేత నారా లోకేష్ తీరుపై రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మండిపడ్డారు. కత్తిమండ గ్రామంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. లోకేష్ తండ్రి చంద్రబాబు.. ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి, దొంగచాటుగా ముఖ్యమంత్రి అయ్యారని దుయ్యబట్టారు. ఐదెకరాల్లో ప్యాలెస్ కట్టుకున్నానంటూ లోకేష్ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక దళితుడు ఇల్లు కట్టుకుంటే చూసి ఓర్చుకోలేకపోతున్నావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలో ఉండగా ఇసుక దోచుకుని కోట్ల రూపాయలు కాజేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. ఇసుక ద్వారా రాష్ట్రానికి సీఎం జగన్ ఎంతో ఆదాయం సమకూరుస్తున్నారని చెప్పారు. ఎవరో రాసి ఇచ్చింది చదివి, నిజాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అంగన్‌వాడీ, షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులు అమ్ముకున్నారని చెప్పారు. తన తండ్రి 12 ఎకరాలు ఇస్తే ప్రస్తుతం ఏడెకరాల భూమి ఉందని, లోకేష్ తండ్రి చంద్రబాబు రెండెకరాలతో రాజకీయాల్లోకి వచ్చి వేలాది ఎకరాలు, వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారని నిలదీశారు. అవినీతి చేసి తండ్రి చంద్రబాబు జైలుకు వెళ్లాడన్న విషయం మరచిపోయి, ఎదుటి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే రాపాక అన్నారు.

అయినవిల్లి సబ్‌స్టేషన్‌కు నేడు సీఎం శంకుస్థాపన

అమలాపురం రూరల్: అయినవిల్లిలో నిర్మించనున్న 400/132 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొత్తగా నిర్మించనున్న సబ్‌స్టేషన్లకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని వివరించారు. అయినవిల్లిలో జరిగే కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి తెలిపారు. ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టు–1, ఆడియో మెట్రీషియన్ పోస్టు–1 భర్తీకి కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల నాలుగో తేదీ లోగా కొవ్వూరులోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో పని వేళల్లో అందించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 8886 11 2666 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

కోనసీమ ఐఎంఏకు 6 అవార్డులు



రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ నుంచి అవార్డులు అందుకుంటున్న కోనసీమ ఐఎంఏ సభ్యులు

అమలాపురం టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ జిల్లా శాఖకు ఆరు అవార్డులు లభించాయి. ఈ నెల 25న విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ ఈ అవార్డులు అందించారని జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ కదలి ప్రసాద్ తెలిపారు. స్పెషల్ కేటగిరీలో కోనసీమ ఐఎంఏ ప్రతినిధులు, సీనియర్ వైద్యులైన పీఎస్ శర్మ, పయ్యావుల సురేష్ అవార్డులు అందుకున్నారు. అలాగే కోనసీమ ఐఎంఏ భవన నిర్మాణానికి, మహిళా డాక్టర్ల విభాగానికి, క్షయ వ్యాధి నిర్మూలనకు చేస్తున్న కృషికి, డాక్టర్ల దినోత్సవాన్ని అవగాహన, చైతన్యం దిశగా నిర్వహించినందుకు ఆరు అవార్డులు వచ్చాయన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు మాధురి



ఉప్పలగుప్తం: సెంట్రల్ యూనివర్సిటీ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు గొల్లవిల్లి వాలీబాల్ క్లబ్ క్రీడాకారిణి వీరవల్లి మాధురి ఎంపికయ్యారు. జేఎన్‌టీయూకే జట్టు తరఫున మాధురి ఈ పోటీల్లో పాల్గొనున్నారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో జరిగిన పోటీల్లో మాధురి ప్రతిభ చాటి జాతీయ స్థాయికి అర్హత సాధించా రు. గొల్లవిల్లి జెడ్పీ హైస్కూలులో సోమవారం ఆమెను పలువురు అభినందించారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ దంగేటి అచ్యుత జానకి, జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆమెను అభినందించారు.


సమయం లేదు మిత్రమా!

- ఇంటర్ పరీక్ష ఫీజుకు సమీపిస్తున్న తుది గడువు
- 30 వరకే అవకాశం
- ఆ తేదీ దాటితే రూ.వెయ్యి అపరాధ రుసుంతో 15 వరకూ అనుమతి



ఇంటర్ విద్యార్థులు

రాయవరం: వచ్చే ఏడాది మార్చి నెలలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువు దగ్గర పడుతోంది. ఈ నెలాఖరుతో గడువు పూర్తి కానున్నందున ఇప్పటికీ ఇంకా పరీక్ష ఫీజులు చెల్లించని విద్యార్థులు త్వరపడాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటర్ పరీక్ష ఫీజుల షెడ్యూల్‌ను గత నెల 31న విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకూ పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశముంది. ఈ గడువు దాటిన తర్వాత జాప్యమయ్యే కొద్దీ అపరాధ రుసుం మోత మోగనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎంత వీలైతే అంత త్వరగా పరీక్ష ఫీజు చెల్లించడమే మేలు. విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుగానే మేల్కొని, ఫీజు చెల్లించి చివరి నిమిషంలో ఆందోళన చెందే పరిస్థితి తెచ్చుకోకుండా.. పరీక్షలకు సాఫీగా సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.



ఫీజుల చెల్లింపు ఇలా..

- ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ జనరల్/ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్షలకు రూ.550 ఫీజు చెల్లించాలి.
- జనరల్ కోర్సులు చదివే సెకండియర్ సైన్స్ విద్యార్థులు మాత్రం ప్రాక్టికల్స్‌కు రూ.250 చెల్లించాల్సి ఉంది.
- ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ.150 చెల్లించాలి.
- సెకండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం థియరీ ఫీజు కలిపి రూ.1,100 చెల్లించాల్సి ఉంటుంది.
- ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.500 చెల్లించాలి.
- బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్షలకు కడితే రూ.300 చెల్లించాలి.
- ఫస్టియర్, సెకండియర్ పాసై, మార్కుల ఇంప్రూవ్‌మెంట్‌కు పరీక్ష రాసే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,240 వంతున, సైన్స్ విద్యార్థులు రూ.1,440 వంతున పరీక్ష ఫీజు చెల్లించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

గడువులోగా చెల్లించాలి



పరీక్ష ఫీజు గడువులోగా చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఆదేశాలు ఇచ్చాం. పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించాం.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య, అమలాపురం

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు



పరీక్ష ఫీజును ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు మాత్రమే వసూలు చేయాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పరీక్ష ఫీజులు అధికంగా వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తప్పవు.

– ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి, రాజమహేంద్రవరం

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 130 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఎయిడెడ్ ఒకటి, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఆరు, హైస్కూల్ ప్లస్ 19, ఒకేషనల్ కళాశాలలు 25, ప్రైవేట్ కళాశాలలు 66 ఉన్నాయి. వీటిల్లో ఇంటర్ ఫస్టియర్ 14,629 మంది, సెకండియర్ 12,832 మంది చదువుతున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు (ఐపీఈ) రాయాలంటే దరఖాస్తు చేయడంతో పాటు పరీక్ష ఫీజు తప్పనిసరిగా చెల్లించాలి. ఒకవేళ విద్యార్థులు నిర్ణీత గడువు ఈ నెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించకుంటే, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రూ.1,000 అపరాధ రుసుంతో చెల్లించవచ్చు.



ఆడుదాం ఆంధ్ర వాల్‌పోస్టర్, మస్కట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

ఆడుదాం ఆంధ్ర పోటీలకు 13 వరకూ రిజిస్ట్రేషన్లు

అమలాపురం రూరల్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వచ్చే నెల 13వ తేదీ వరకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని అన్నారు. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఆడుదాం ఆంధ్ర వాల్‌పోస్టర్‌ను, మస్కట్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 15 ఏళ్ల వయస్సు పైబడిన క్రీడాకారులు సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు లేదా 1902కు కాల్ చేయడం ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో వచ్చే నెల 15 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకూ క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయని వివరించారు. విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేస్తామని చెప్పారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు ప్రత్యేక నగదు బహుమతులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబుతో కలసి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతానికి కృషి చేయాలన్నారు. దీనికి జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి, మండల స్థాయిలో ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని చెప్పారు. నిర్దేశించిన విధంగా గ్రామాల్లో జరుగుతున్న ప్రచార కార్యక్రమాలను జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. జనవరి 26 వరకూ జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా క్షేత్ర స్థాయి అధికారులు పని చేయాలని అన్నారు. రైతు పండించిన ధాన్యం సేకరణ, తరలింపులో ఎటువంటి జాప్యం లేకుండా జియో ట్యాగింగ్ ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్లు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. జేసీ నుపూర్ అజయ్ మాట్లాడుతూ, జనవరి చివరి వారంలో పేదల ఇళ్ల మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. దీనికి అనుగుణంగా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో గృహ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మెగా గ్రౌండింగ్ మేళాకు మండలాలవారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని, వచ్చే జనవరి నెలాఖరుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు కూడా వేగవంతం చేయాలని జేసీ అజయ్ సూచించారు. లంక గ్రామాల్లో చేపట్టిన పట్టాల పంపిణీ చురుకుగా నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

స్పందనకు 166 అర్జీలు



స్పందనలో అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



అర్జీదారుల ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం రూరల్: కలెక్టరేట్ గోదావరి భవనంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 166 మంది అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం – స్పందన అర్జీల పరిష్కారంలో ఏమాత్రం అలసత్వం చూపవద్దని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులను 24 గంటల్లో ఓపెన్ చేయడం లేదని, దీనిని రాష్ట్ర స్థాయి టీములు పర్యవేక్షిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఏ రోజు వచ్చిన ఫిర్యాదులను అదే రోజు ఓపెన్ చేసి, సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులకు పంపాలని ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకే సమస్యపై అర్జీలు పునరావృతమైతే అర్జీదారును పిలిపించి, ఆ సమస్య పరిష్కరించాలని, లేకుంటే ఏ కారణంతో పరిష్కరించలేకపోతున్నారో స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 19 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 19 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు అర్జీదారులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి తమ సమస్యలు చెప్పుకొన్నారు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చాయి. కొన్ని ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే చర్యలు చేపడుతూ ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. జిల్లా స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చికెన్ ధర ఢమాల్

- లైవ్ బ్రాయిలర్ కోడి కేజీ రూ.72 మాత్రమే
- స్కిన్ రూ.150, స్కిన్‌లెస్ ధర రూ.175
- కార్తిక మాసం ప్రభావం



ఆలమూరు: కార్తిక మాసం, అయ్యప్ప స్వాముల దీక్షల ప్రభావంతో నెల రోజులుగా చికెన్ విక్రయాలు తగ్గిపోయాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో బ్రాయిలర్ చికెన్ ధర గణనీయంగా పడిపోయింది. లైవ్ కోడి ధర రికార్డు స్థాయిలో మూడేళ్ల కనిష్టానికి చేరుకుంది. ఈ పరిణామం కోళ్ల ఉత్పత్తి కంపెనీలు, కోళ్ల రైతులు, వ్యాపారులను తీవ్ర నిరాశకు గురి చేస్తుండగా.. మాంసాహార ప్రియులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోళ్ల ఉత్పత్తిలో రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన వివిధ కంపెనీల నుంచి సాధారణంగా ప్రతి రోజూ సుమారు 350 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల ఎగుమతులు జరుగుతున్నాయి. వాతావరణం సానుకూలంగా ఉండటంతో ఇటీవల కోళ్ల ఉత్పత్తి పెరిగింది. సరిగ్గా ఇదే సమయంలో కార్తిక మాసం ప్రభావంతో చికెన్‌కు ఒక్కసారిగా డిమాండు పడిపోయింది. దీంతో ప్రస్తుతం రోజుకు 200 టన్నుల వరకూ మాత్రమే ఎగుమతులు జరుగుతున్నాయి. సరఫరా తగ్గినా విక్రయాలు లేకపోవడం ధరలు మరింతగా పడిపోవడానికి కారణమైంది. ఫలితంగా చికెన్ దుకాణాలపై ఆధారపడిన చిరు వ్యాపారులు ఆదాయం పడిపోతోందంటూ గగ్గోలు పెడుతున్నారు.

ధర తగ్గినా..

బహిరంగ మార్కెట్‌లో చికెన్ ధరలు భారీగా తగ్గినా ఆ మేరకు విక్రయాలు మాత్రం పెరగడం లేదు. దీనివల్ల హోల్‌సేల్ వ్యాపారులు నెల రోజుల క్రితం కిలో కోడి లైవ్ రూ.132కు విక్రయించగా.. ప్రస్తుతం అది కాస్తా ఏకంగా రూ.62కు పడిపోయింది. రెండు కేజీల బరువు వచ్చే వరకూ కోడిని పెంచితే సరాసరి రూ.210 వరకూ ఖర్చవుతుందని, ప్రస్తుతం ఆ బరువు కలిగిన కోడిని అమ్మితే రూ.84 వరకూ నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో బ్రాయిలర్ కోడి కేజీ హోల్‌సేల్ ధర రూ.72గా ఉండగా.. చికెన్ కేజీ స్కిన్‌తో రూ.150, స్కిన్‌లెస్ రూ.175 వరకూ విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి మరో నెల రోజులు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో దాణా ఖర్చు భరించలేక కంపెనీదారులు, రైతులు ఉత్పత్తి అయిన కోళ్లను నష్టమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు తరలిస్తున్నారు.

డిమాండ్ తగ్గిపోయింది



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా చికెన్‌కు డిమాండ్ తగ్గిపోయింది. దీనివల్ల మూడేళ్ల కనిష్ట స్థాయికి చికెన్ ధర పడిపోయింది. దీంతో దిగుమతులు తగ్గించుకోవడంతో వ్యాపార లావాదేవీలు సక్రమంగా జరగడం లేదు. కోళ్ల ధర తగ్గడంతో రైతులు, సరఫరాదారులతో పాటు గ్రామీణ చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కోళ్ల రైతులు ఏడాది పాటు పడిన కష్టమంతా ఒక్క ఈ నెలలోనే నీరుగారిపోతోంది.

– బొబ్బా వెంకన్న, హోల్‌సేల్ కోళ్ల వ్యాపారి, పెదపళ్ల

రత్నగిరి.. జనసునామీ

- సత్యదేవుని దర్శించిన 1.50 లక్షల మంది
- రికార్డు స్థాయిలో 15,629 వ్రతాలు
- రూ.1.50 కోట్ల ఆదాయం

అన్నవరం: కార్తిక పౌర్ణమి, సోమవారం పర్వదినాలు రెండూ కలసి రావడంతో సత్యదేవుని సన్నిధి.. రత్నగిరిపై జనసునామీ ఎగసిపడింది. స్వామివారి దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలని విధంగా భక్తజనసందోహంతో నిండిపోయింది. వేలాది వాహనాల్లో భక్తులు తరలి రావడంతో దేవస్థానం ఘాట్ రోడ్లు, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలు కూడా కార్లతో నిండిపోయాయి. సత్యదేవుని రికార్డు స్థాయిలో సుమారు లక్షన్నర మంది భక్తులు దర్శించారని అధికారులు అంచనా వేశారు.



వ్రత టిక్కెట్ల విక్రయ కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ

దండిగా ఆదాయం

దేవస్థానానికి సోమవారం దండిగా ఆదాయం సమకూరింది. ఒక్క వ్రతాల ద్వారానే సుమారు రూ.70 లక్షలు సమకూరగా మిగిలిన విభాగాల ద్వారా రూ.40 లక్షలు వచ్చింది. మొత్తం మీద అన్ని విభాగాల ద్వారా రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షించారు. సుమారు 20 వేల మంది భక్తులకు ఉచితంగా పులిహోర, దధ్యోదనం, చిన్న పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

అర్ధరాత్రి ఒంటి గంట నుంచే..

సుమారు 20 వేల మంది భక్తులు సోమవారం రాత్రికే రత్నగిరికి చేరుకున్నారు. దీంతో స్వామివారి ఆలయాన్ని సోమవారం వేకువన ఒంటిగంటకు తెరచి వ్రతాలు ప్రారంభించారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ రద్దీ కొనసాగింది. స్వామివారి అంతరాలయ దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపలి నుంచే దర్శనానికి అనుమతించారు.



ఆలయ ప్రాంగణంలో భక్తజనసందోహం

స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో, రావిచెట్టు వద్ద, ధ్వజ స్తంభం వద్ద జ్యోతులు వెలిగించి దీపారాధన చేశారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది.

వ్రత మండపాలు ఖాళీ లేక..

అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో స్వామివారి వ్రత మండపాలు, నిత్య కల్యాణ మండపం, పాత కల్యాణ మండపాలన్నీ నిండిపోయాయి. వ్రతాలకు ఇంకా భక్తులు బారులు తీరినప్పటికీ మండపాలు ఖాళీ లేక సుమారు గంటసేపు టిక్కెట్ల విక్రయం నిలిపివేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోకి రాకుండా పశ్చిమ రాజగోపురం తలుపులు మూసివేశారు. గంట తరువాత వ్రతాల టిక్కెట్ల విక్రయం పునఃప్రారంభించారు. మొత్తమ్మీద రికార్డు స్థాయిలో 15,629 వ్రతాలు జరిగాయి. వీటిల్లో రూ.300 టిక్కెట్ వ్రతాలే 10,821 కాగా, రూ.వెయ్యి టిక్కెట్ వ్రతాలు 2,070, రూ.2 వేల వ్రతాలు 1,166, రూ.1,500 వ్రతాలు 1,511 ఉన్నాయి. మిగిలినవి ఆన్‌లైన్ వ్రతాలు. కార్తిక మాసం ప్రారంభమయ్యాక గడచిన 15 రోజుల్లో ఇంత భారీ సంఖ్యలో భక్తులు రావడం, వ్రతాలు జరగడం ఇదే ప్రథమం. రద్దీ అధికంగా ఉండడంతో స్వామివారి నిత్య కల్యాణ మండపంలో కూడా ఉదయం 11 గంటల వరకూ వ్రతాలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుని నిత్య కల్యాణం ప్రారంభించారు. సుమారు వంద మంది భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైంగిక దాడి కేసులో జీవిత ఖైదు

గాయపరిచినందుకు 20 ఏళ్ల జైలు శిక్ష

కాకినాడ లీగల్: ఐదున్నరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, రూ.3,500 జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ జగన్నాథపురం ముత్తా నగర్‌కు చెందిన యువకుడు తాడి ప్రభు అలియాస్ చిన్న అలియాస్ దొంగ చిన్న 2020 నవంబర్ 25వ తేదీ రాత్రి మద్యం తాగి, గోలీలపేటలోని ఓ ఇంట్లోకి దొంగతనానికి వెళ్లాడు. ఆ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగిలించి, అక్కడ నిద్రిస్తున్న బాలికను యాళ్లవారిగరువు బరియల్ గ్రౌండ్‌కు తీసుకువెళ్లి, లైంగిక దాడికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక తల్లి కె.కాంతమ్మ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు విచారణలో తాడి ప్రభుపై నేరం రుజువు కావడంతో లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా, లైంగిక దాడిలో గాయపరచినందుకు 20 ఏళ్ల జైలు, రూ.1,000 జరిమానా, బాలికను కిడ్నాప్ చేసినందుకు ఐపీసీ 366 ప్రకారం పదేళ్ల జైలు, రూ.500 జరిమానా, సాక్ష్యాధారాలు తారుమారు చేసినందుకు మూడేళ్ల జైలు, రూ.500 జరిమానా, సెల్‌ఫోన్ దొంగిలించినందుకు ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఐదు సెక్షన్లకు ఏకకాలంలో జైలుశిక్ష అమలు చేయాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.


సత్యరథంలో సత్యదేవుడు, అమ్మవారు


స్వామివారి ప్రచార రథం


గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, ఈఓ రామచంద్ర మోహన్

గిరులు.. తరులు.. భక్తమహోఝురులై..

- ఘనంగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ
- స్వామివారి వెంటన మహాప్రవాహంలా కదలిన భక్తులు
- 2 లక్షల మందికి పైగా రాక

అన్నవరం: కొండ ఎక్కి తన దర్శనానికి రాలేని భక్తుల కోసం.. తన గిరులపై జన్మ ఎత్తిన వృక్షాలు, పక్షులు, జంతువుల పాపాలు తొలగించేందుకు.. నిత్యం తనను పవిత్ర జలాలతో అభిషేకించే పంపా నదికి.. తన దర్శన భాగ్యం కలిగించేందుకు దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ దేవితో కలసి స్వయంగా ఆ రత్నగిరి వాసుడు సత్యదేవుడే కదిలాడు. లక్షలాదిగా భక్తులు వెంట రాగా.. పౌర్ణమి పర్వదినం కలసి వచ్చిన కార్తిక సోమవారం నిర్వహించిన సత్యదేవుని గిరి ప్రదక్షిణ నభూతో.. అన్న రీతిలో సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలిరావడంతో.. అన్నవరంలో ఆధ్యాత్మిక తరంగం ఎగసిపడింది. సుమారు ఐదు గంటల పాటు సాగిన ఈ గిరి ప్రదక్షిణ 11 కిలోమీటర్ల మేర సాగింది. రత్నగిరి తొలి పావంచా నుంచి, కార్యక్రమం ముగిసిన పంపా ఘాట్ వరకూ 11 కిలోమీటర్ల మేరా గిరి ప్రదక్షిణ మార్గం ఇసుక వేస్తే రాలని రీతిలో మహాభక్తజన ప్రవాహాన్ని తలపించింది. స్వామి, అమ్మవారి పల్లకీ పంపా ఘాట్‌కు చేరిన తరువాత కూడా రెండు గంటల వరకూ భక్తులు వస్తూనే ఉన్నారు. ఒక వైపు పంపా నది, మరోవైపు పచ్చని కొండల నుంచి వచ్చే చల్లని గాలితో గిరి ప్రదక్షిణ ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. స్వామివారి పల్లకీకి ఇరువైపులా చెరో మూడు కిలోమీటర్ల మేర భక్తులు 'సత్యనారాయణ, లక్ష్మీనారాయణ' అంటూ స్వామివారి నామాన్ని భక్తితో జపిస్తూ ముందుకు సాగారు.


గిరి ప్రదక్షిణలో పోటెత్తిన భక్తజన ప్రవాహం

గిరి ప్రదక్షిణ జరిగిందిలా..

గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు వేలాదిగా భక్తులు ఉదయం ఆరు గంటలకే చేరుకోవడంతో తొలి పావంచా వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. ఉదయం 7.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను మేళతాళాల నడుమ రత్నగిరి నుంచి కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు పల్లకీ మీద ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు కొబ్బరి కాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. అయ్యప్ప దీక్షధారులు, సత్యస్వాముల భజనలు, కోలాట నృత్యాలు, మహిళల భక్తిగీతాలాపనల నడుమ.. ముందు పల్లకీ మీద సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు.. ఆ వెనుక సత్యరథం, భక్తులు తరలిరాగా గిరి ప్రదక్షిణ కోలాహలంగా ఆరంభమైంది.

అన్నవరం మెయిన్ రోడ్డు మీదుగా బెండపూడి సమీపంలోని పుష్కర కాలువ వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకున్న సత్యదేవునికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుష్కర కాలువ వెంబడి పంపా తీరం వరకూ గిరి ప్రదక్షిణ సాగింది. మధ్యలో మూడుచోట్ల స్వామి, అమ్మవార్లకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ ప్రదేశాల్లో పల్లకీలో ఉన్న స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పండితులు పూజలు చేశారు. ఉదయం 11.30 గంటలకు గిరి ప్రదక్షిణ పంపా ఘాట్‌కు చేరిన తర్వాత స్వామి, అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా రత్నగిరికి చేర్చారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, దేవస్థానం వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం అవధాని, చిట్టి శివ ఘనపాఠి, సంతోష్ ఘనపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ఇతర అర్చకస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన అంచనాలు.. తప్పని ఇబ్బందులు

- గిరి ప్రదక్షిణ ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు వస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఉదయం 7.30 గంటల సమయంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. దాంతో ఆయన రాకుండానే గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. అరగంట తరువాత వచ్చిన ఎమ్మెల్యేకి ఈఓ రామచంద్ర మోహన్ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పర్వత భక్తులతో కలసి కొంతసేపు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.
- గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తుల కోసం అన్నవరం దేవస్థానం, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభిమానులు, ఇతర దాతలు 15 చోట్ల మంచినీరు, పండ్లు, ఫలహారాలు, పాలు, బిస్కెట్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. అయితే అంచనాకు మించి భక్తులు రావడంతో గిరి ప్రదక్షిణ ప్రారంభమై గంటలోనే ఆ స్టాల్స్ అన్నీ ఖాళీ అయిపోయాయి. తరువాత వచ్చిన భక్తులు కనీసం మంచినీళ్లు కూడా దొరక్క ఇబ్బంది పడ్డారు. తిరిగి మంచినీళ్లు తీసుకురావాలన్నా గిరి ప్రదక్షిణ మార్గంలో ఎటు చూసినా లక్షలాదిగా భక్తులు ఉండటంతో ఏమీ చేయలేక అధికారులు చేతులెత్తేశారు.
- గిరి ప్రదక్షిణ పుష్కర కాలువ వెంట కొనసాగుతుండగా పక్కనే పొలాల్లో మేస్తున్న పది ఆవులు భక్తుల నినాదాలకు భయపడి, వారి మీదకు దూసుకు వచ్చి తొక్కేశాయి. ఈ ఘటనలో నలుగురు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి.
- గిరి ప్రదక్షిణ బందోబస్తుకు సుమారు వంద మంది పోలీసులను నియమించినట్టు చెబుతున్నా అంచనాకు మించి భక్తులు రావడంతో వారు సరిపోలేదు. పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో తొలి పావంచా నుంచే భక్తుల మధ్య తోపులాటలు జరిగాయి.

లారీని ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల దుర్మరణం

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రంజన్ కుమార్ (22), రోహిత్ (24) అక్కడి నుంచి మోటార్ సైకిల్‌పై అన్నవరం బయలుదేరారు. సోమవారం గోపాలపురం మండలం కరిచర్లగూడెం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రంజన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న రోహిత్‌ను గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై కె.సతీష్ కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ప్రమాదంలో మృతి చెందిన యువకుడు, నుజ్జయిన బైక్


ప్రమాదానికి ముందు సెల్ఫీ తీసుకున్న మృతులు

పట్టుబడిన లంచావతారాలు

- పాస్ పుస్తకానికి రూ.26 వేల డిమాండ్
- స్పందన కాల్ సెంటర్‌కు రైతు ఫిర్యాదు
- వల పని పట్టుకున్న ఏసీబీ అధికారులు

కిర్లంపూడి: ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఓ వీఆర్ఓ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆమెతో పాటు కిర్లంపూడి డిప్యూటీ తహసీల్దార్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం సోమరాయణంపేట గ్రామానికి చెందిన బుద్ధ జయ ఆదినారాయణకు పాలెం గ్రామంలో 1.38 సెంట్ల భూమి ఉంది. దీనిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పాస్ పుస్తకం ఇచ్చేందుకు వీఆర్ఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ఎం.శ్రీనివాసరావు రూ.26 వేల లంచం అడిగారు. తాను అంత మొత్తం చెల్లించుకోలేనని ఆదినారాయణ చెప్పాడు. అయినప్పటికీ ఇవ్వాల్సిందేనని డీటీ, వీఆర్ఓ డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు స్పందన కాల్ సెంటర్ ద్వారా రాజమహేంద్రవరం ఏసీబీ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లాడు. వారి సూచన మేరకు పాలెం సచివాలయంలో వీఆర్ఓ లక్ష్మీదేవికి ఆదినారాయణ సోమవారం డబ్బులు అందజేశాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి, వీఆర్ఓను డబ్బులతో సహా అదుపులోకి తీసుకున్నారు. డీటీ శ్రీనివాసరావును విచారించగా రైతును డబ్బులు అడిగినట్లు చెప్పారు. దీంతో వారిద్దరినీ ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వ సంబంధిత పనుల కోసం ఎవరైనా అధికారులు లంచాలు అడిగితే స్పందన 104 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సౌజన్య సూచించారు. దాడిలో సీఐలు వాసుకృష్ణ, శ్రీనివాస్, సతీష్, ఎస్సై విల్సన్, సిబ్బంది పాల్గొన్నారు.


ఏసీబీకి పట్టుబడిన డీటీ, వీఆర్ఓ





పట్టుబడిన ఇళ్ల దొంగల ముఠా

- ముగ్గురి అరెస్టు
- రూ.12.5 లక్షల సొత్తు స్వాధీనం

అమలాపురం టౌన్: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి, వారి నుంచి రూ.12.5 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నామని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అయినవిల్లి మండలం నేదునూరు శివారు అరిపాలానికి చెందిన పినిపే నవీన్‌కుమార్, పులిదిండి కిరణ్, అదే మండలం నేదునూరు పెదపాలేనికి చెందిన కుమ్మరి మనోజ్ స్నేహితులు. పాతికేళ్ల లోపు యువకులు. వీరు ఒక ముఠాగా ఏర్పడి, ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పది చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు ముగ్గురూ ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించి, వారిని అరెస్టు చేశారు. ఈ ముఠా అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో 2, అంబాజీపేట పరిధిలో 3, అయినవిల్లిలో 2, పి.గన్నవరం, కొత్తపేట, అల్లవరం పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కో చోరీకి పాల్పడ్డారు.

వీరి నుంచి 220.74 గ్రాముల బంగారు నగలు, 718.71 గ్రాముల వెండి వస్తువులు, ఒక టీవీ, ఒక గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో క్రైం సీఐ బి.తిరుపతిరావు, రూరల్ సీఐ పి.వీరబాబు, తాలూకా పోలీసు స్టేషన్ ఎస్సై ఎ.పరదేశి, క్రైం ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణల బృందం నిందితులను అరెస్టు చేసింది. కోర్టులో హాజరు పరచిన అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను ఎస్పీ శ్రీధర్ అభినందించారు. వారికి తగిన రివార్డులు ఇవ్వనున్నామని తెలిపారు.

సచివాలయ విధులపై అవగాహన పెంచుకోవాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- 11 జిల్లాల మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

సామర్లకోట: సచివాలయాల విధులపై మాస్టర్ ట్రైనర్లు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్ల రెండు రోజుల శిక్షణను ఈటీసీలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని సీనియర్ పంచాయతీ కార్యదర్శులను మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలు ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా పరిపాలనను వికేంద్రీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్య భావన ప్రేరణతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలను స్వయం సమృద్ధి, స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా మార్చేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. సోమ, మంగళ వారాల్లో ఒక బ్యాచ్, 29, 30 తేదీల్లో రెండో బ్యాచ్‌లో మాస్టర్ ట్రైన్లకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌కు 120 మంది చొప్పున 11 జిల్లాల నుంచి 240 మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. వారు శిక్షణ పూర్తి చేసుకుని ఆయా మండలాల్లోని సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. శిక్షణలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని వేణుగోపాల్ సూచించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డిప్యూటీ డైరెక్టర్లు జి.రమణ, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన హామీల్లో గ్రామ సచివాలయాల ఏర్పాటు ఒకటని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. తొలి రోజు ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, శ్రీదేవి, నిహారిక శిక్షణ ఇచ్చారు.



మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో మాట్లాడుతున్న వేణుగోపాల్

వృద్ధురాలి సజీవదహనం

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి లైన్‌పేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధురాలు సజీవదహనమైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగాబత్తుల వెంకాయమ్మ (90) తన కుమార్తె కాశి నల్లమ్మ ఇంటికి ఆనుకుని ఉన్న తాటాకింట్లో నివసిస్తోంది. తల్లి బాగోగులను నల్లమ్మే చూస్తోంది. వెంకాయమ్మ సోమవారం రాత్రి తన తాటాకింట్లో నిద్రించింది. తెల్లవారుజాము విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆ తాటాకింటికి నిప్పంటుకుని, క్షణాల్లో మంటలు వ్యాపించాయి. అనారోగ్యంతో, మంచం మీద లేవలేని స్థితిలో ఆ ఇంట్లో ఉన్న వెంకాయమ్మ ఆ మంటల్లో సజీవ దహనం అయింది. ఆ సమయంలో నిద్రలో ఉండటంతో ఎవ్వరూ ఈ ప్రమాదాన్ని గమనించలేదు. తల్లి అగ్నికి ఆహుతైందంటూ కుమార్తె నల్లమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. దగ్ధమైన ఇంటిని, వెంకాయమ్మ మృతదేహాన్ని ఐ.పోలవరం ఎస్సై రాజేష్ సిబ్బందితో కలసి సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


వెంకాయమ్మ (పాత చిత్రం)